

సాక్షి
బాపట్ల
బుధవారం । 21 । ఆగస్టు । 2024



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 589.40 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 8,144 క్యూసెక్కులు వదిలారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 7837 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 340 క్యూసెక్కులు వదిలారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు చివరి రోజైన మంగళవారం కల్యాణ మహోత్సవం నిర్వహించారు. మహాపూర్ణాహుతి హోమంలో ఎమ్మెల్యే జీవీ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి లింగంగుంట్ల అగ్రహారం భూముల సర్వే



నరసరావుపేట: మండలంలోని పుష్పగిరి పీఠానికి చెందిన లింగంగుంట్ల అగ్రహారం భూముల విషయంలో మిగిలిన సర్వే పనులు బుధవారం నుంచి చేపట్టాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో దేవదాయశాఖ అధికారులు, రైతులకు చెందిన సమన్వయకమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. సర్వే శాఖ ద్వారా భూ వర్గీకరణ మ్యాప్‌లను పరిశీలించారు. ఇంతకు ముందే భూ సర్వే నిర్వహించిన విషయం విదితమే.

గాలివాన బీభత్సం

ఇళ్లపై పడ్డ భారీ వృక్షం



విజయపురిసౌత్: విజయపురిసౌత్‌లో సోమవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. భారీ వృక్షం ఇళ్లపై పడి సుమారు రూ.1.50 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. గాలి వాన తీవ్రతకు స్థానిక సి టైపులోని 26, 27 నెంబర్ గల ఇళ్లపై భారీ వృక్షం పడటంతో ఇళ్లు ధ్వంసం అయ్యాయి. ఇళ్ల పైకప్పు రేకులతోపాటు ఫర్నిచర్ కూడా ధ్వంసమైంది. ఇంటి యజమానులు గంటెనపల్లి రమేష్, సీహెచ్ రాజులు నిరాశ్రయులయ్యారు. మంగళవారం రెవెన్యూ అధికారులు ఇళ్లను పరిశీలించి నష్టాన్ని అంచనా వేశారు. బాధితులకు న్యాయం చేయాలని స్థానిక ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఊరే మార్క్ డిమాండ్ చేశారు.

పదోన్నతులు చేపట్టాకే సర్దుబాటు చేయాలి

ఎస్టీయూ ఏపీ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ఎస్ఎం సుభాని



సత్తెనపల్లి: పదోన్నతులు చేపట్టాకే ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలని ఎస్టీయూ ఏపీ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ఎస్.ఎం.సుభాని అన్నారు. సత్తెనపల్లిలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పాఠశాల విద్యాశాఖ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ చేపట్టే ముందు స్కూల్ అసిస్టెంట్లకు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా, ఎస్టీటీలను స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు ఇవ్వాలన్నారు. ఆ తర్వాత పని సర్దుబాటు చేపడితే చాలా వరకు ఉపాధ్యాయులకు ఇబ్బందులు తగ్గుతాయన్నారు. ప్రతి జిల్లాలో 700 నుంచి 800 వరకు రిటైర్డ్ అయిన ఉపాధ్యాయుల ఖాళీలు ఉన్నాయన్నారు. కొన్ని జిల్లాలలో పదోన్నతుల ప్రక్రియ ఇంతవరకు చేపట్టలేదన్నారు. ఆ దిశగా ఆలోచించి చర్యలు చేపట్టాలన్నారు.

దాతల సహకారంతో ప్లాంటేషన్



ప్రత్తిపాడు: దాతల సహకారంతో ప్రత్యేక మొక్కల ప్లాంటేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గుంటూరు జిల్లా పంచాయతీ అధికారి కె.శ్రీదేవి చెప్పారు. ఈ నెల 24న పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు వెల్లడించారు. దీనిలో భాగంగా అనువైన స్థలాన్ని ఎంపిక చేయడానికి మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి శ్రీదేవి, జెడ్పీ సీఈఓ ఎన్ఎస్‌వీబీ వసంతరాయుడు ప్రత్తిపాడు మండలంలో పర్యటించారు. స్థానిక నిమ్మగడ్డవారిపాలెం రోడ్డులో రహదారికి ఇరువైపులా రెండు వేల మొక్కలను ఒకేరోజు నాటేందుకు కావాల్సిన చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో రామకోటయ్యతోపాటు ఉపాధిహామీ అధికారులకు సూచించారు. ఈ ప్రాంతం మొక్కలు నాటేందుకు అనువుగా ఉందని, కార్యక్రమానికి కలెక్టర్ హాజరవుతారని వివరించారు. మొక్కలను దాతల సహకారంతో సమకూర్చుకోవాలని ఆదేశించారు. వారి వెంట ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ షేక్ ఖాజా, ఎన్ఆర్ఈజీఎస్ ఇన్‌చార్జి ఏపీవో మస్తాన్ వలి, గ్రామనాయకుడు నిమ్మగడ్డ సతీష్ తదితరులు ఉన్నారు.

అరటి.. ధర అదిరింది!

మధురమైన రుచులతో సామాన్యులకు అందుబాటులో ఉండే అరటి పండు ధర అమాంతం పెరిగింది. సామాన్యులు కొనుగోలు చేయాలంటేనే బెదిరిపోతున్నారు. నిన్నమొన్నటి వరకు ధరలు లేక తోటల్లో గెలలు చెట్లకే మగ్గిపోయిన పరిస్థితి. ఇప్పుడు బహిరంగ మార్కెట్‌లో భారీగా ధర పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దిగుబడి లేని సమయంలో డిమాండ్ పెరగడంతో మరికొందరు రైతులు మాత్రం ఆవేదన చెందుతున్నారు. పండ్ల కొనుగోలుదారులు మాత్రం అరటి అంటే చాలు అమ్మో అనే పరిస్థితికి వచ్చారు.



కొల్లూరు ప్రాంతం నుంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు లారీలో లోడ్ చేసిన కర్పూర రకం అరటి గెలలు

- కొరత కారణంగా పెరిగిన పండ్ల ధరలతో అన్నదాతలకు ఊరట
- దిగుబడి లేక కొందరికి తప్పని నిరాశ
- ప్రస్తుతం అరకొరగా గెలల దిగుబడి
- మారిన వాతారణ పరిస్థితులే కారణం
- శుభకార్యాల నేపథ్యంలో పండ్లకు పెరిగిన డిమాండ్
- ఎన్నడూ లేని ధరతో కొనుగోలుదారులకు అవస్థలు

కొల్లూరు: మారిన వాతావరణ పరిస్థితిలో అరటి దిగుబడి అంతగా లేదు. పెనుగాలులు, ఎండలు, ప్రస్తుతం వాతావరణంలో వేడి తీవ్రంగా ఉండటంతో అరటి దిగుబడి మందగించింది. జిల్లాలో సుమారు 2,379 మంది రైతులు 3,710 ఎకరాలలో అరటి సాగు చేస్తున్నారు. కర్పూర, చక్రకేళి, కూర అరటి రకాలు ఇందులో ఉన్నాయి. ఎకరాకు 800 వరకు అరటి మొక్కలు సాగు చేస్తే 10 నెలల వ్యవధిలో పంట చేతికి అందుతుంది. ఎకరాకు సుమారు రూ. 1.50 లక్షల వరకు పెట్టుబడి అవసరం. పంట చేతికందిన అనంతరం స్థానిక మార్కెట్లలో అమ్మకాలు జరపడంతోపాటు తోటల్లోనే వ్యాపారులకు గెలలు విక్రయిస్తున్నారు. రాష్ట్రంలోని నెల్లూరు, ప్రకాశం, విజయవాడ, తిరుపతి ప్రాంతాలతోపాటు తెలంగాణ, తమిళనాడు, పశ్చిమబెంగాల్, ఒరిస్సా వంటి రాష్ట్రాలకు ఎగుమతులు చేస్తున్నారు. ప్రస్తుతం సాగు విస్తీర్ణంలో 5 శాతం కంటే తక్కువ తోటల్లో మాత్రమే గెలలు అందుబాటులో ఉన్నాయి. దీంతో కొరత ఏర్పడి ధరలకు రెక్కలొచ్చాయి. దీనికితోడు శ్రావణమాసంలో అధికంగా పూజలు, శుభకార్యాలు ఉండటంతో పండ్లకు డిమాండ్ పెరిగింది. వేసవిలో గెలలు కొనే వారే లేకపోవడంతో సాధారణ, మొదటి రకం గెలలు రూ. 20 నుంచి రూ. 30కు సైతం విక్రయించిన రైతులు నష్టాలపాలయ్యారు. ప్రస్తుతం కర్పూర అరటి మొదటి రకం రూ. 1,200, సాధారణ రకం రూ. 800 వరకు ధర పలుకుతున్నాయి. చక్రకేళి రకం గెలకు రూ. 450 వరకు ధర లభిస్తోంది. కూర అరటి సైతం సగటున గెల రూ. 300కు అమ్ముడవుతోంది. పండ్లు డజను రూ. 80 నుంచి రూ. 120 వరకు విక్రయిస్తున్నారు.

గెల రూ. 400 పలికినా లాభమే..



అధిక పెట్టుబడులు పెట్టి సాగు చేస్తున్న అరటి పంటకు ప్రస్తుతం పలుకుతున్న ధరలు ఇలాగే ఎప్పుడూ ఉండవు. కనీసం గెలకు రూ. 400 వరకు పలికినా లాభాలు వస్తాయి. రెండేళ్ల పంట కాలంలో రెండు పర్యాయాలు కాపునకు వచ్చే గెలలు అధికంగా దిగుబడి వచ్చే నవంబర్ నుంచి రేట్లు పడిపోకుండా ఉంటే మాకు మేలు చేకూరుతుంది.

– ముత్తిరెడ్డి శ్రీనివాసరావు,
రైతు, కిష్కిందపాలెం, కొల్లూరు మండలం

పడిపోయిన విక్రయాలు



అరటి పండ్ల వ్యాపారంతోనే జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారిని. పెరిగిన ధరల వల్ల అమ్మకాలు పడిపోయి కుటుంబపోషణ భారంగా మారుతోంది. మార్కెట్లో గెలలు పాడుకొని తీసుకొచ్చి అమ్మకాలు చేపడితే, అంతగా విక్రయాలు లేవు. కాయలు పాడైపోయి నష్టాలొస్తున్నాయి.

– అట్లూరి అర్జున్,
అరటి పండ్ల వ్యాపారి, కొల్లూరు

అంతర పంటతో ఊరట



అరటిలో అంతర పంట వేసుకొంటే వచ్చే ఆదాయంతో నెట్టుకొస్తున్నాం. రూ. 1.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టా. ఏటా ధరలు లేక పెట్టుబడులూ రావట్లేదు. గెలకు వచ్చిన చెట్లు పెనుగాలుల ధాటికి విరిగి పోవడంతో ఇటీవల నష్టం ఎక్కువవుతోంది.

– తాడికొండ రాంబాబు,
రైతు, చిలుమూరులంక, కొల్లూరు మండలం

పరిశ్రమల స్థాపనపై ప్రత్యేక దృష్టి

జేసీ బి.సుబ్బారావు



సమావేశంలో మాట్లాడుతున్న బి.సుబ్బారావు

బాపట్ల: జిల్లాలో పరిశ్రమల స్థాపనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు తెలిపారు. బాపట్ల కలెక్టరేట్‌లో 2024–29 కాలానికి పారిశ్రామిక అభివృద్ధి విధానం, ఎంఎస్ఎంఈ వ్యవస్థాపకత, ఆహార శుద్ధి పరిశ్రమల విధానం రూపకల్పనకు వివిధ పరిశ్రమల వర్గాల నుంచి స్వీకరించిన సలహాలు, సూచనలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పరిశ్రమల ఏర్పాటుకు జిల్లాలో వనరులు, ఖనిజాలు అపారమన్నారు. మెరైన్ పరిశ్రమల స్థాపనకు అనుమతుల్లో నిర్దేశించిన 40 అడుగుల రోడ్డు నిబంధన కొంత సడలించాలని పారిశ్రామికవేత్తలు అభిప్రాయపడ్డారు. కరెంటు కోతలు లేకుండా చూడాలన్నారు. విద్యుత్ బిల్లు చెల్లించేటప్పుడే రాయితీలు ఇవ్వాలన్నారు. నిర్దేశిత గడువులోగా అనుమతులు మంజూరు చేయకుంటే ఆమోదం వచ్చేలా చూడాలని, బ్యాంకు రుణ మంజూరులో నిబంధనలు సరళతరం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వేగంగా సమస్యలు పరిష్కరించాలి

బాపట్ల: జిల్లాలో ఎన్నో ఏళ్లుగా ఉన్న ఇనాం భూములు, ఎస్టేట్ సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఈనాం భూముల సమస్యలపై ఆర్డీవో, తహసీల్దార్‌లతో సమావేశం నిర్వహించారు. ఇనాం ఎస్టేట్‌లైన మార్టూరు మండలం లక్కవరం, జంగమహేశ్వరపురం, పర్చూరు మండలం ఎడుబాడు, సంతమాగులూరు మండలం గోపాపురం గ్రామాలు రైత్వారీగా మార్చడానికి పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. ఇనాం గ్రామాలైన చెన్నుబోట్ల అగ్రహారం, కొమ్మాలపాడు, చెన్నుపల్లి గ్రామాలు కూడా ఇదేవిధమైన పరిష్కారం కోసం వేచి ఉన్నట్లు పేర్కొన్నారు.

కలకలం రేపిన మహిళ ఆత్మహత్యాయత్నం

- అధికారుల వేధింపులే కారణమని మెసేజ్
- భర్త అభ్యర్థించడంతో ప్రయత్నం విరమణ

మార్టూరు: ప్రకృతి వ్యవసాయం విభాగంలో పని చేసే ఓ మహిళ తన సీనియర్లు, అధికారుల వేధింపులు తాళలేక సోమవారం రాత్రి బలవన్మరణానికి యత్నించారు. చివరిసారిగా భర్తతో వీడియో కాల్‌లో మాట్లాడటం కోసం ఆమె చేసిన ప్రయత్నమే ప్రాణాన్ని కాపాడింది. బాధిత కుటుంబం వివరాల మేరకు.. బాపట్ల జిల్లా మార్టూరు మండలంలో ఓ వివాహిత పర్చూరు మండలంలోని ఓ గ్రామంలో యూనిట్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు. సోమవారం రాత్రి 11 – 12 గంటల మధ్య ఆమె సోషల్ మీడియాలో పెట్టిన వీడియోతోపాటు తనను వేధింపులకు గురి చేస్తున్న వారి పేర్లతో కూడిన మెసేజ్ వైరల్ అయింది. విషయం తెలిసిన విలేకరులు ఆ మహిళను ఫోన్ ద్వారా వివరణ కోరగా.. తాను విషాహారం తీసుకునే ముందు వీడియో కాల్ ద్వారా చివరిసారి భర్తకు ఫోన్ చేసి విషయం చెప్పడంతో భర్త విలపిస్తూ కుమార్తె కోసమైనా ప్రయత్నం విరమించుకోమని కోరడంతో మనసు మార్చుకున్నట్లు తెలిపారు. కాగా, పర్చూరు మండలం నూతలపాడు గ్రామానికి చెందిన ఇదే శాఖలో మోడల్ ట్రైనర్‌గా విధులు నిర్వహిస్తున్న అప్పారావు లైంగిక వేధింపులు భరించలేక జూలై 20వ తేదీన సుమారు 15 మంది యద్దనపూడిలో జరిగిన ఓ సమావేశంలో పర్చూరు వ్యవసాయ శాఖ ఏడీఏ ఎస్.మోహన్ రావుకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశామని మహిళ గుర్తుచేశారు. ఎలాంటి ఫలితం లేకపోవడంతో అతను మరీ రెచ్చిపోతున్నట్లు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై బాపట్ల డీపీఎం వాణిశ్రీని అప్పట్లోనే విలేకరులు వివరణ కోరగా.. ఫిర్యాదు కాపీ తనకు రాకుండా చర్యలు ఎలా తీసుకోగలనని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. చర్యలు తీసుకొని ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని మహిళా ఉద్యోగులు చెబుతున్నారు.

ఆరీఫ్ హత్య కేసులో మరో ఇద్దరి అరెస్టు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జగదీష్ నాయక్

చీరాల: చీరాల ప్రాంతంలో సంచలనం సృష్టించిన సయ్యద్ ఆరీఫ్ హత్య కేసులో మిగిలిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ జగదీష్ నాయక్ మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈ నెల 6న చీరాల మండలం ఈపూరుపాలెం ఈసుబ్‌నగర్‌కు చెందిన సయ్యద్ అమీన్ ఆరీఫ్ (18)ను అతి కిరాతకంగా హత్య చేసిన ఘటనలో సంబంధం ఉన్న వారిలో ఆరుగురిని 12న అరెస్టు చేశామన్నారు. మరో ఇద్దరు పరారీలో ఉండగా.. వారిని అరెస్టు చేసేందుకు ఎస్పీ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ ఆధ్వర్యంలో డీఎస్పీ జగదీష్‌నాయక్, చీరాల రూరల్ సీఐ, ముగ్గురు ఎస్సైలు, 20 మంది సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కేసులో మిగిలిన ఇద్దరు గరిక మహేంద్ర, కర్రెద్దుల వంశీకుమార్‌లను మంగళవారం వాడరేవు–రామాపురం బీచ్ రోడ్డులో ఒకరిని, మున్నం అపార్టుమెంట్ దగ్గర ఒకరిని అరెస్టు చేశామని పేర్కొన్నారు. నేరానికి ఉపయోగించిన టాటా సఫారీ స్ట్రోమ్ కారును సీజ్ చేశామన్నారు. ఈ కేసులో ముద్దాయిలపై త్వరితగతిన చార్జిషీట్ దాఖలు చేసి న్యాయస్థానంలో కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో నిందితులను పట్టుకునేందుకు కృషి చేసిన అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్, డీఎస్పీ జగదీష్ నాయక్, సీఐ ఎన్.సత్యనారాయణ, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

జవానుకు కన్నీటి వీడ్కోలు



నాగూర్ బాషా మృతదేహంపై జాతీయ జెండాను ఉంచుతున్న ఆర్మీ అధికారులు



నాగూర్ బాషా శవ పేటికను మోస్తున్న దృశ్యం

కాకుమాను: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఆర్మీ జవాన్ షేక్ నాగూర్ బాషా(40) సోమవారం అర్ధరాత్రి మృతి చెందారు. కాకుమానుకు చెందిన ఆయన 22 సంవత్సరాల క్రితం ఆర్మీలో చేరారు. ప్రస్తుతం జమ్మూ కశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం సెలవుపై స్వగ్రామం రాగా, వారం క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలయ్యారు. కుటుంబ సభ్యులు గుంటూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించారు. చికిత్స అందిస్తుండగా సోమవారం అర్ధరాత్రి ఆయన మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెనాలి బెటాలియన్‌కు చెందిన ఆర్మీ అధికారులు మంగళవారం నాగూర్ బాషా మృతదేహానికి నివాళులు అర్పించారు. సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. అధికారులతోపాటు కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఆయనకు కన్నీటివీడ్కోలు పలికారు. నాగూర్ బాషాకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.


ఆప్కాస్ ఉద్యోగులకు జీతాలు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): ఈనెల జీతాలు అందక నగరపాలక సంస్థ ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులపై ఈనెల 19న సాక్షిలో 'జీతాలు బాబో' శీర్షికన ప్రచురితమైన కథనానికి నగరపాలక సంస్థ అధికారులు స్పందించారు. సీఎఫ్ఎంఎస్ అధికారులతో మాట్లాడి 20వ తేదీ మధ్యాహ్నానికి ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో జీతాలు జమయ్యేలా చర్యలు తీసుకున్నారు. దీంతో 3,175 మంది ఆప్కాస్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కుప్పడం కూలడం ఖాయం..!

- చేనేత రంగంపై చిన్నచూపు ఫలితం
- మరమగ్గాలపైనే కుప్పడం రకం తయారీ
- ఆ దెబ్బకు కార్మికుల విలవిల
- ఉపాధి లేక ఇతర రంగాల వైపు చూపు
- చట్టాలున్నా అమలు చేయని సర్కారు
- సాయంపై తేల్చని కూటమి ప్రభుత్వం
- నాడు 'నేతన్న నేస్తం'తో వైఎస్ జగన్ అండ

కూటమి ప్రభుత్వం వచ్చింది. చేనేతల బతుకులు ఛిద్రం అయ్యాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేనేత కార్మికులు వైభవాన్ని చూశారు. కూటమి ప్రభుత్వం రావడంతో అంతకుముందు టీడీపీ ప్రభుత్వంలో చవిచూసిన పరిస్థితినే మళ్లీ చూడాల్సి వస్తుందేమోనని చేనేతలు భయపడుతున్నారు. చేనేత రంగంపై పవర్‌లూం పడగవిప్పింది. చేనేత వస్త్రాల పేరుతో మరమగ్గాలపై తయారవుతున్న వస్త్రాలు మార్కెట్లో చలామణి అవుతున్నాయి. దీంతో చేనేత రంగం దోపిడీకి గురవుతోంది. ఫలితంగా కార్మికులు విలవిల్లాడుతున్నారు. చట్టాలున్నా అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం, సర్కారుపరంగా తమకు ఆర్థిక సాయాన్ని వంటి భరోసా లేకపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చీరాల: జిల్లాలోని చీరాల, వేటపాలెం, రేపల్లె, మార్టూరు, బాపట్ల మండలాల్లో చేనేత కార్మికులు ఎక్కువగా ఉంటారు. వీరంతా అధికంగా కుప్పడం, చిన్న కుప్పడాలు, కుప్పడం కంచి బార్డర్, జరీ పట్టు చీరలు, డ్రస్ మెటీరియల్ వంటి వాటిని నేస్తుంటారు. ప్రధానంగా మార్కెట్లో అధికంగా డిమాండ్ ఉన్న కుప్పడం చీరలు నేస్తుంటారు. కుప్పడం చీరలు నేస్తేనే కార్మికులకు కాస్త చెప్పుకోదగిన ఆదాయం ఉంటుంది. దంపతులు కలిసి బారు (ఐదు చీరలు) నేస్తే రూ. 13 వేలు మజూరి (కూలీ) మిగులుతుంది. అంటే నెలకు నాలుగు బార్లు నేస్తే ఖర్చులుపోను రూ. 25 వేల వరకు ఆదాయం ఉంటుంది. కొంతకాలంగా చీరాల ప్రాంతంలో భారీగా పవర్‌లూం (మరమగ్గాలు)లను ఏర్పాటు చేశారు. మరమగ్గాలపై కుప్పడంతో సహా అన్ని రకాల చీరలు తయారు చేసి దేశంలోని ప్రధాన పట్టణాలకు ఎగుమతి చేస్తున్నారు. ఏది అసలైన చేనేత వస్త్రమో తెలియని కొనుగోలుదారులు.. చేనేత పేరుతో తక్కువ ధరకు వస్తున్న ఈ వస్త్రాలను తీసుకుంటున్నారు. దీంతో అసలైన చేనేత కార్మికులకు పనిలేకుండా పోయింది. ఇటీవలి వరకు నెలకు రూ. 25 వేలు సంపాదిస్తున్న కార్మికులు ప్రస్తుతం మంగళగిరి వెరైటీలు తయారు చేస్తున్నారు. నెలకు రూ.10 వేలు కూడా మిగలకపోవడంతో మగ్గం వదలాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. కొద్ది నెలలుగా చాలామంది ఉపాధి అవకాశాలు దెబ్బతినడంతో ఈ రంగాన్ని వీడుతున్నారు.

రిజర్వేషన్‌కు చెల్లుచీటీ..

చేనేతలకు కేటాయించిన రిజర్వేషన్ చట్టాలను పవర్‌లూం పెట్టుబడిదారులు అడ్డంగా దోచుకుంటున్నారు. దీన్ని అడిగే నాథుడే లేడు. చట్టం అతిక్రమిస్తే కేసులు పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని ఏర్పాటు చేసింది. కానీ ఫలితం లేకుండా పోయింది. ఈ విభాగం ఒకటి ఉందని కూడా అందరూ మరిచారు. కనీస తనిఖీలు లేకపోవడంతో పవర్‌లూం యజమానులదే ఇష్టారాజ్యంగా మారింది. కేంద్రం చేనేత రంగాన్ని కాపాడేందుకు అనేక పోరాటాల అనంతరం 11 రకాల వస్త్రాలకు రిజర్వేషన్ కల్పించింది. ఈ వస్త్రాలు చేనేత మగ్గాలపైనే తయారు చేయాలనే చట్టం ఉంది. కానీ అది ప్రస్తుతం అమలు కావడం లేదు. కేంద్రంలోని కొందరు అధికారులు కూడా మరమగ్గాలకే సహకరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

చర్యలు తీసుకోని అధికారులు..

రిజర్వేషన్ వస్త్రాలను పవర్‌లూంపై తయారు చేస్తే చట్ట వ్యతిరేకంగా భావించాలి. అలాంటి మరమగ్గాలపై చర్యలు తీసుకుని, మూసేసే అధికారం చేనేత విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతోపాటు జిల్లా స్థాయి ఏడీలకు కూడా ఉంటుంది. కానీ పవర్ లూములన్నీ ఎక్కువగా మాస్టర్ వీవర్లే నడుపుతారు. దీంతో వారిచ్చే మామూళ్లకు కక్కుర్తిపడిన అధికారులు చట్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవడం లేదు.

నేతన్న బతుకుల్లో వెలుగు నింపిన వైఎస్ జగన్

చేనేత రంగానికి పూర్వవైభవం తీసుకురావాలనే ఉద్దేశంతో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక వెంటనే వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ప్రవేశపెట్టారు. ఈ పథకం కింద మగ్గం ఉన్న ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.24 వేల వంతెన అప్పటి ప్రభుత్వం చెల్లించింది. ఇప్పటి వరకు వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో జిల్లాలో 2019–20కు గాను రూ.18.67 కోట్లు, 2020–21లో 18.22, 2021–22లో 18.64, 2022–23లో రూ.19.89 కోట్ల చొప్పున చెల్లించారు. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో చేనేత కార్మికులకు నేతన్న నేస్తం ఉండుంటే ఎంతో భరోసా లభించేదని కార్మికులు అంటున్నారు. ఇంటి అవసరాలకు, పిల్లల చదువులు వంటి వాటికి నేతన్న నేస్తం ద్వారా వచ్చిన రూ.24 వేలు ఎంతో దోహదపడేవని చెబుతున్నారు.

గతంలో టీడీపీ హయాంలో జరిగిన చేనేత కార్మికుల ఆత్మహత్యలు మళ్లీ పునరావృతం అయ్యేలా నేడు పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పరంగా సాయంపై ఇంతవరకు ఎలాంటి ప్రకటనా రాకపోవడంపైనా వారు ఆందోళనలో ఉన్నారు. ఇకనైనా తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

'నేతన్న నేస్తం' ఆదుకుంది..

మరమగ్గాల కారణంగా మాకు పనిలేకుండా పోయింది. గతంలో కుప్పడం రకం వంటి చీరలు నేసి నెలకు రూ.25 వేల వరకు సంపాదించేవాడిని. కానీ ఇప్పుడు ఈ చీరలు మరమగ్గాలపై పెద్దసంఖ్యలో తయారు అవుతుండటంతో కొనుగోలుదారులు వాటినే తీసుకుంటున్నారు. మాకు కనీసం ఉపాధి లేకుండా పోయింది. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మాకు నేతన్న నేస్తం పథకం కింద వచ్చిన రూ. 24 వేలతో ఇంటి అవసరాలన్నీ తీర్చుకునేవాడిని. ఇప్పుడు మాలాంటి వారికి ఆ ఆర్థిక భరోసా లేకుండా పోయింది.

– జి. సుబ్బారావు,
చేనేత కార్మికుడు, ఈపూరుపాలెం

క్లుప్తంగా

పిడుగుపాటుకు మహిళ మృతి



వేమూరు(అమర్తలూరు): పొట్ట కూటి కోసం పనులకు వెళ్లిన మహిళను పిడుగు రూపంలో మృత్యువు వెంటాడింది. అమర్తలూరు మండలంలోని పాంచాళవరం గ్రామంలో పిడుగు పడి తిరుపతమ్మ (35) అనే కూలీ మృతి చెందింది. పోలీసు కథనం మేరకు.. చెరుకుపల్లి మండలంలోని పోన్నపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు మంగళవారం అమర్తలూరు మండలంలోని పాంచాళవరం గ్రామంలో నాట్లు వేస్తున్నారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. నాటు వేస్తున్న నలుగురు మహిళల మధ్య పిడుగు పడింది. వారిలో తిరుపతమ్మ అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. మిగతా ముగ్గురిని తెనాలి ప్రభుత్వం వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించినట్లు ఎస్‌ఐ అమర్ వర్ధన్ తెలిపారు.

బైకు అదుపుతప్పి వ్యక్తి దుర్మరణం



మేదరమెట్ల: మోటారు బైకు అదుపుతప్పి ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన ఘటన కొరిశపాడు మండలం బొడ్డువానిపాలెం వద్ద మంగళవారం చోటు చేసుకుంది. అందిన వివరాల మేరకు.. అద్దంకికి చెందిన షేక్ నాగూర్ బాషా (23) అద్దంకి నుంచి మోటారు బైకుపై ఒంగోలు బయలుదేరాడు. బొడ్డువానిపాలెం వద్దకు రాగానే బైకు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో నాగూర్‌బాషా రోడ్డుపై ముందుకు పడిపోవడంతో అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. మేదరమెట్ల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రకృతి వనంలో వేధింపుల చీడ

- ఎంటీ అప్పారావు వేధింపులపై మహిళా సిబ్బంది గతంలోనే ఫిర్యాదు
- కనీస చర్యలు తీసుకోలేదని డీపీఎంపై ఆరోపణలు
- విచారణకు ఆదేశిస్తే వాస్తవాలు వెలుగు చూస్తాయంటున్న సిబ్బంది



జూలై 20వ తేదీన యద్దనపూడిలో ఏడీఏకు అప్పారావుపై ఫిర్యాదు చేస్తున్న మహిళా సిబ్బంది

మార్టూరు: ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుతున్న మహిళా సిబ్బందికి నిత్యం వేధిపులు తప్పడం లేదు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు లేకపోవడంతో కొందరు ఈ వేధింపులను కొనసాగిస్తూనే ఉన్నారు. ఆంధ్ర ప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ కింద గ్రామీణ ప్రాంతాలకు చెందిన పదో తరగతి, ఇంటర్, డిగ్రీ అర్హతలు గల ఎక్కువమంది మహిళలతోపాటు నిరుద్యోగ యువకులు రూ.7,500 నుంచి రూ.23,000 వేతనాలకు అర్హతను బట్టి విధులు నిర్వహిస్తుంటారు. వీరిలో స్వగ్రామంలో పనిచేసే వారు కొందరైతే.. పక్క మండలాలు, ఇతర దూర ప్రాంతాల్లో పనిచేస్తూ ఒంటరిగా నివాసాలు ఉండే మహిళలు కొందరు ఉన్నారు. వారికి తమ పైస్థాయి సిబ్బంది లైంగిక వేధింపులు, దౌర్జన్యాలను ఎదుర్కోవటం శక్తికి మించిన పనైపోతోంది. అంతర్మథనంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నవారు. ముఖ్యంగా బాపట్ల జిల్లాలోని పర్చూరు, చీరాల డివిజన్‌లో వేధింపుల తీవ్రత అధికంగా ఉన్నా డీపీఎం వాణిశ్రీ ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ డిపార్ట్‌మెంట్‌లో పర్చూరు డివిజన్‌కు మాస్టర్ ట్రైనర్‌గా (ఎంటీ) అదే మండలంలోని నూతలపాడు గ్రామానికి చెందిన సీహెచ్ అప్పారావు విధులు నిర్వహిస్తున్నాడు. ఇతనిపై అనేక ఆరోపణలు ఉన్నాయి. అప్పారావు వేధింపులు పరాకాష్టకు చేరడంతో భరించలేక జూలై 20వ తేదీ బాధిత మహిళా సిబ్బంది పర్చూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు(ఏడీఏ) ఎస్.మోహన్‌రావుకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా చర్యలు లేవు. చీరాల డివిజన్లో ఎంటీగా పనిచేస్తున్న మహిళపై ఎల్-2గా పనిచేసే శ్రీనివాస్ అనే వ్యక్తి ఆమె అరాచకాల గురించి డీపీఎంకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంలో అంతరార్థం ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపితే ఎన్నో అక్రమాలు, అరాచకాలు వెలుగు చూసే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. మామూళ్ల మత్తులో డీపీఎం ఇలాంటి సిబ్బందిపై చర్యలు తీసుకోవడం లేదని, రహస్యంగా విచారణ జరిపితే తాము వాస్తవాలను వివరిస్తామని చెప్పటం గమనార్హం.

సిబ్బంది సమస్యలపై దృష్టి పెడతాం..

బాపట్ల జిల్లాలో జరుగుతున్న వేధింపులు విషయం విలేకరులు నా దృష్టికి తెచ్చే వరకు తెలియదు. అప్పారావుపై ఏడీఏ మోహన్‌రావుకు సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించాను. తప్పకుండా వారికి న్యాయం జరిగేలా చూస్తా.

– విజయ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్, ఏపీసీఎన్‌ఎఫ్

ఫిర్యాదులు వాస్తవమే..

జూలై 20వ తేదీన యద్దనపూడి సమావేశంలో అప్పారావు వేధింపుల గురించి మహిళా సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదుపై ఆరా తీయగా వాస్తవమేనని తెలిసింది. అతడిని పద్ధతి మార్చుకోమని చెప్పాను. అయినా మారలేదు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

– ఎస్.మోహన్‌రావు, ఏడీఏ, పర్చూరు

కాపీ రాకుండా చర్యలెలా?

ఎంటీ అప్పారావుపై పర్చూరు ఏడీఏ మోహన్‌రావుకు మహిళా సిబ్బంది గత నెల 20వ తేదీ ఫిర్యాదు చేసిన సంగతి నా దృష్టికి వచ్చింది. కానీ ఫిర్యాదు కాపీ నా దగ్గరకు రాలేదు. ఫిర్యాదు కాపీ అందకుండా నేనెలా చర్యలు తీసుకుంటాను?

– వాణిశ్రీ, డీపీఎం, బాపట్ల

గిట్టని వారు చేస్తున్న ప్రచారం

జూలై 20వ తేదీ యద్దనపూడిలో మా సిబ్బంది నాపై పర్చూరు ఏడీఏ మోహన్ రావుకు ఫిర్యాదు చేసిన మాట నిజమే. ఆయన నన్ను వివరణ అడిగారు కూడా. నాపై గిట్టని వారు చేస్తున్న ప్రచారం ఇది, ఇందులో వాస్తవం లేదు.

– అప్పారావు, ఎంటీ

శునకాల దాడిలో జింక మృతి



మార్టూరు: కుక్కల దాడిలో ఓ జింక మృతి చెందిన ఘటన మండలంలోని కోలలపూడి గ్రామంలో మంగళవారం ఆలస్యంగా వెలుగు చూసింది. కూకట్లపల్లి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రమేష్ తెలిపిన వివరాల మేరకు.. కోలలపూడి గ్రామానికి చెందిన రైతు దాసరి శ్రీనివాసరావు మంగళవారం స్థానికంగా ఉన్న తన మామిడి తోటలో పనులు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో తన తోటలో జింక కళేబరాన్ని గుర్తించారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, గ్రామ సర్పంచి సతీష్ కుమార్‌లకు సమాచారం అందించారు. కోలలపూడి పశు వైద్యురాలు అశ్విని ఘటనాస్థలికి చేరుకొని కళేబరాన్ని పరిశీలించారు. కుక్కల దాడిలో వారం క్రితం జింక మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పొలం సమీపంలోనే జింక కళేబరాన్ని దహనం చేశారు.

వాహనం ఢీకొని యాచకుడు మృతి



మేదరమెట్ల: గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకుడు మృతి చెందాడు. ఈ ఘటన కొరిశపాడు మండలం తిమ్మనపాలెం పండు హోటల్ సమీపంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... సుమారు 60 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి రోడ్డు దాటే క్రమంలో ఒంగోలు వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. అతడు ఈ ప్రాంతంలో ఉంటున్న యాచకుడని దర్యాప్తులో తేలింది. మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టు మార్టం నిమిత్తం తరలించారు.

దున్నపోతును ఢీకొట్టిన బైక్

- దున్నపోతు అక్కడికక్కడే మృతి
- ముగ్గురు యువకులకు తీవ్రగాయాలు

వేటపాలెం: మోటార్ బైక్‌పై వేగంగా వెళ్తూ రోడ్డు దాటుతున్న దున్నపోతును ఢీకొట్టారు యువకులు. ఈ ఘటనలో దున్నపోతు అక్కడికక్కడే మృతి చెందగా, యువకులకు తీవ్రగాయాలయ్యాయి. అందిన వివరాల మేరకు.. వేటపాలేనికి చెందిన పోగడదండ వెంకటేశ్వర్లు, మస్తాన్‌రెడ్డి, మరో యువకుడు కలిసి చీరాల నుంచి బైపాస్ రోడ్డులో మోటార్ బైక్‌పై వస్తున్నారు. అదే సమయంలో వేటపాలెం బైపాస్ రోడ్డు వై జంక్షన్ దగ్గరలో రోడ్డు దాటుతున్న దున్నపోతును వారి బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో దున్నపోతు అక్కడికక్కడే మృతి చెందింది. బైక్‌పై వెళ్తున్న ముగ్గురు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌లో వారిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. బైపాస్ వై జంక్షన్ వద్ద వీధి లైట్లు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు వీధి లైట్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.




కంటికి గాయమైన ఓ యువకుడు



దున్నపోతు కళేబరం

సర్కారు అగ్రకుల కూటమి

ప్రముఖ కవి డాక్టర్ కత్తి పద్మారావు



పుస్తకాలను స్వీకరించిన వారితో డాక్టర్ పద్మారావు

పొన్నూరు: డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ జీవన విధానాన్ని యువకులు అలవర్చుకోవాలని ప్రముఖ కవి డాక్టర్ కత్తి పద్మారావు అన్నారు. మంగళవారం పట్టణంలోని లుంబినీవనం అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్‌ను పామర్రుకు చెందిన ప్రముఖులు కోటే రామనాథ్, కాకి కిరణ్ సందర్శించారు. ఈ సందర్భంగా కత్తి పద్మారావు మాట్లాడుతూ గ్రామీణ అంబేడ్కర్ యువజన సంఘాలు, దళితుల ఐక్య సంఘటన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ ప్రభుత్వం అగ్రకుల కూటమి అని, సర్కారు అగ్రవర్ణాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు. అంబేడ్కర్ విగ్రహాల మీద కూడా దాడులు చేయటం చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత ఉద్యమం మొదటి నుంచి ఆత్మగౌరవంతో నడిచిందని, కారంచేడు, చుండూరు, లక్ష్మీపేట వంటి అన్ని పోరాటాల్లో అగ్రకులాలను ఎదిరించి ఎన్నో హక్కులు సాధించామని వెల్లడించారు. రాబోయేది దళిత బహుజన రాజ్యమేనని, ఈ అగ్రవర్ణాల కూటమి ఎంతో కాలం ఉండదని పేర్కొన్నారు. సంపద పంచుకునే విషయంలో అగ్రకులాల్లో వైరుధ్యాలు వస్తాయని, వేచి చూడాలని చెప్పారు. పద్మారావు రచించిన కొన్ని గ్రంథాలను సందర్శకులు స్వీకరించారు.

పసుపు రైతులకు పరిహారమేదీ!

పసుపు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్న శివశంకరరావు



సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతు నేతల నిరసన

తెనాలి: దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీలో జరిగిన అగ్నిప్రమాదంలో పసుపు పంటను కోల్పోయిన రైతులకు ప్రభుత్వ ఒప్పందం ప్రకారం క్వింటాలుకు రూ.7,000 చొప్పున ఎప్పుడు ఇస్తారని ఆంధ్రప్రదేశ్ పసుపు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్న శివశంకరరావు ప్రశ్నించారు. పసుపు పంట కాలిపోయి ఇప్పటికి ఏడు నెలలు గడిచినా నష్టపరిహారం అందకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘ నాయకులు మంగళవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. విజయవాడలో స్వాక్షాత్తు వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, అధికారులు, రైతులతో చర్చలు జరిపి పసుపు నష్టపోయిన రైతులకు క్వింటాలుకు రూ.7,000 చెల్లిస్తామని హామీనిచ్చినట్లు గుర్తుచేశారు. అయినా ఇంతవరకు ఆ దిశగా అడుగులు పడలేదని శివశంకరరావు విమర్శించారు. ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడం సరికాదన్నారు. అగ్ని బాధిత పసుపు రైతుల సంఘం కన్వీనర్ వేములపల్లి వెంకటరామయ్య, పసుపు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్వామి రెడ్డి మాట్లాడుతూ పరిహారం మంజూరుకు ప్రభుత్వం కాలయాపన చేయమటం రైతులను ఆవేదనకు గురిచేస్తోందని అన్నారు. బీమా డబ్బులూ వచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు ములకా శివసాంబి రెడ్డి, నాదెళ్ల చంద్ర శేఖర్, నాదెళ్ల సురేంద్ర, గద్దె శ్రీ హరి, చందు సత్యనారాయణ, శివారెడ్డి, సురేంద్ర, వెంకటేశ్వరరావు, పుల్లయ్య, గోవింద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డెంగీతో మహిళ మృతి

మేడికొండూరు: సిరిపురంలోని చైతన్యకాలనీ మొదలులోని ఎస్సీ కాలనీలో విషజ్వరాలు విజృంభించాయి. డెంగీతో బాధపడుతున్న ఓ మహిళ మంగళవారం మృతిచెందింది. కాలనీకి చెందిన మంచు సౌందర్య (28)కు గత శనివారం రాత్రి జ్వరం వచ్చింది. ఆదివారం గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరింది. వైద్యులు డెంగీ అని నిర్ధారించారు. అక్కడే చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతురాలి కుమార్తె కూడా రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. ఎస్సీ కాలనీలో విజృంభిస్తున్న జ్వరాలతో స్థానికులు భయపడుతున్నారు. అయినా వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు. గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించాలని కోరుతున్నారు.

వీధికో లీకు.. మరమ్మతుకో సాకు !

- పైపులైన్ల నుంచి నిత్యం లీకవుతున్న వేల లీటర్లు
- పట్టణంలో సర్వసాధారణంగా మారిన సమస్య
- పలుచోట్ల కలుషిత నీటి సరఫరాతో ఆందోళన
- శివారు ప్రాంతాల్లో గుక్కెడు నీటికీ తప్పని అవస్థలు



కూరగాయల మార్కెట్ సమీపంలో రోడ్డుపైకి వచ్చిన తాగునీరు

రేపల్లె రూరల్: మున్సిపాలిటీ పైపులైన్లకు ఏర్పడుతున్న లీకేజీలతో వేల లీటర్ల తాగునీరు నిత్యం వృథాగా పోతోంది. సమస్యను అరికట్టడంలో అధికారులు విఫలం అవుతున్నారు. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో సమస్య కనిపిస్తోంది. విలువైన తాగునీరు వృథాగా మురుగు కాల్వల పాలవుతోంది. పలుచోట్ల కలుసిత నీటి సరఫరాకు కూడా ఈ సమస్య కారణమవుతోంది. మరికొన్ని ప్రాంతాలలో తాగునీరు రహదారులపైకి చేరటంతో ఆ ప్రాంతాలు జలమయంగా మారుతున్నాయి.

కాలం చెల్లిన పైపులైను

దాదాపు 30 సంవత్సరాల క్రితం పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రధాన కుళాయి పైపులైన్‌లు నిత్యం మరమ్మతులకు గురవుతున్నాయి. ఏదో ఒక ప్రాంతంలో లీకేజీలు సర్వసాధారణంగా మారాయి. అధికారులు గుర్తించి మరమ్మతులు చేస్తున్నా శాశ్వత ప్రయోజనం లేకుండా పోతోంది. మరుసటిరోజే అదే ప్రాంతంలోగానీ, పక్కనే మరొక చోటగానీ లీకేజీలు పరిపాటిగా మారాయి. తాగునీరు వదిలిన సమయంలో లీకేజీల ద్వారా బయటికి పోయిన నీరు ఆపాక ఆ నీటితోపాటు మురుగు నీరు కూడా మళ్లీ పైపుల్లోకి చేరుతోంది. మరుసటి రోజు ఆ నీరే కొళాయిల ద్వారా పలు ప్రాంతాలకు సరఫరా అవుతోంది. దీంతో అక్కడి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు.

శివారు ప్రాంతాలకు అందని నీరు

ఈ లీకేజీల కారణంగా పట్టణంలోని శివారు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో మున్సిపాలిటీ తాగునీరు సరఫరా కావడం లేదు. దీంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా 1, 28, 22, 23, 24, 25, 26 వార్డులకు పూర్తిస్థాయిలో నీరు సరఫరా కావడం లేదు. ఇప్పటికీ 1, 28 వార్డులలో ప్రజలకు మున్సిపాలిటీ ట్యాంకర్ ద్వారా నీరు అందిస్తున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఈ ప్రాంతాల్లో సమస్య తీవ్రం..

పట్టణంలోని పలు ప్రాంతాలలో మున్సిపల్ పైపులైన్లకు తరచూ లీకేజీలు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా పెద్ద మసీదు, కూరగాయల మార్కెట్, రింగ్ రోడ్ సెంటర్, కృష్ణ టాకీస్ సెంటర్, తాలూకా, నెహ్రూ బొమ్మ సెంటర్, రైలుపేట, శివాలయం రోడ్లలో సమస్య నిత్యకృత్యమైంది. పద్మశాలీయ కళ్యాణ మండపం ఎదుట విద్యుత్తు స్తంభం సమీపంలో ఏర్పడిన లీకేజీ కొన్ని సంవత్సరాలుగా మరమ్మతులకు నోచుకోలేదు. పెద్ద కూరగాయల మార్కెట్ వెనుకవైపు కొన్ని నెలల క్రితం ఏర్పడిన లీకేజీని అరికట్టడంలో అధికారులు శ్రద్ధ చూపడం లేదు.



పద్మశాలీయ కల్యాణ మండపం సమీపంలో..



పెద మసీదు సమీపంలో ఇదీ పరిస్థితి..



6వ వార్డులో వృథా ఇలా..

వృద్ధురాలిని బంధించి చైన్ అపహరణ

- రేషన్ బియ్యం కొంటామని వచ్చి దోచుకున్నారు
- బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు
- సీసీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు



సీతామహాలక్ష్మి

పెదకూరపాడు: ఓ వృద్ధురాలిని బెదిరించి, చీర కొంగుతో బంధించి ఆమె మెడలో ఉన్న నాలుగు సవర్ల బంగారం అపహరించిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాలు... గ్రామంలోని బుచ్చియ్యపాలెం రోడ్డులో 70 సంవత్సరాల వయస్సు కలిగిన చుండు సీతామహాలక్ష్మి ఒంటరిగా జీవిస్తోంది. మరో వీధిలో ఆమె పిల్లలు నివాసం ఉంటున్నారు. కొందరు యువకులు రేషన్ బియ్యం కొంటామని ఆ చుట్టు పక్కల ఇళ్లకు వెళ్లి ఆరా తీస్తున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో సీతామహాలక్ష్మి గృహంలో ఒక వ్యక్తి చొరబడ్డాడు. వృద్ధురాలు నోరు మూసి ఒంటిపై ఉన్న నాలుగు సవర్ల బంగారం ఇవ్వాలని బెదిరించాడు. భయభ్రాంతులకు గురైన వృద్ధురాలు సీతామహాలక్ష్మి తన మెడలోని చైన్ తీసి ఇచ్చింది. చెవులకు ఉన్న దుద్దులు తీసుకునే ప్రయత్నం చేయగా అవి నకిలీవని చెప్పడంతో వాటి జోలికి వెళ్లలేదు. చీర కొంగుతో పక్కన ఉన్న కుర్చీలో వృద్ధురాలిని బంధించి దుండగుడు పరారయ్యాడు. మరో దుండగుడు రోడ్డుపై ఆంజనేయస్వామి విగ్రహం వద్ద బైక్‌తో సిద్ధంగా ఉన్నాడు. అనంతరం ఇద్దరూ కలసి బైక్‌పై పరారయ్యారు. కొంత సమయం తరువాత వృద్ధురాలు కట్టు విడిపించుకొని బయటకు వచ్చి కేకలు వేసి స్థానికులకు జరిగిన సంఘటన తెలిపింది. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ బాలూనాయక్ సిబ్బందితో వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. స్థానికంగా ఉన్న శ్రీ కాకతీయ పాఠశాలలోని సీసీ కెమెరాల ఫుటేజ్‌లను పరిశీలించారు. బైక్‌పై వెళ్తున్నట్లు సీసీ ఫుటేజ్‌లో కనిపించడంతో ఆ దిశగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. గత శుక్రవారం ఇదే ప్రాంతంలో శాఖమూరి శ్రీనుకు చెందిన పాడి గేదె అపహరణకు గురైంది. గ్రామస్తులు భయందోళనకు గురవుతున్నారు.

16 మంది సబ్జెక్టు టీచర్లకు స్థాన చలనం

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు అర్బన్, రూరల్ మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ సబ్జెక్టులను బోధించే 16 మంది ఉపాధ్యాయులకు స్థాన చలనం కలిగించింది. ఎంఈఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో పని సర్దుబాటుపై అధికారులు వారిని అవసరమైన పాఠశాలలకు బదిలీ చేశారు. ఇదిలా ఉంటే ఎస్జీటీల సీనియార్టీ జాబితాపై ఉపాధ్యాయుల నుంచి అభ్యంతరాలు వ్యక్తం కావడంతో కౌన్సెలింగ్‌ను వాయిదా వేస్తున్నట్లు ఎంఈఓలు జ్యోతి కిరణ్, నాగేంద్రమ్మ, బీవీ రమణయ్య ప్రకటించారు. కౌన్సెలింగ్ కోసం ఎంఈవో కార్యాలయానికి వచ్చిన ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో ఉంచిన జాబితాలు ఓపెన్ కాకపోవడం, సీనియార్టీ విషయమై తప్పులు దొర్లడంతో తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఉపాధ్యాయ సర్దుబాటు ప్రక్రియ విద్యాశాఖాధికారుల వైఖరితో సంక్లిష్టంగా మారిందని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల కె.బసవలింగారావు, ఎండీ ఖాలీద్, ఏపీటీఎఫ్ (1938) రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో విమర్శించారు. క్షేత్రస్థాయిలో జరగాల్సిన పని సర్దుబాటును డైరెక్టర్ కార్యాలయం నుంచి నిర్వహించడంపై అభ్యంతరం తెలిపారు. విద్యాశాఖ మంత్రి ఉపాధ్యాయ సంఘాలతో సమావేశాలను ఏర్పాటు చేయకపోవడంతో పాటు విద్యాశాఖ డైరెక్టర్ నిర్వహించిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు దిగువ స్థాయి అధికారులు అమలు పర్చకపోవడంతో గందరగోళం నెలకొందని విమర్శించారు.